సాక్షి
చిత్తూరు

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



పేలిన గ్యాస్ సిలిండర్లు

తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె పంచాయతీలో బుధవారం కూలీలు నివాసముంటున్న గుడిసెల్లో నుంచి గ్యాస్ సిలిండర్లు పేలాయి. -8లో



ముత్యాలమ్మా పాహిమాం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి దేవస్థానం అనుబంధ ముత్యాలమ్మ ఆలయ జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సారె సమర్పించారు. పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	24
తిరుపతి	37	23
తిరుమల	33	19
గూడూరు	38	25
నగరి	38	25

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం(సా)	సహర్ శుక్రవారం(ఉ)
తిరుపతి	6.28	4.45
చిత్తూరు	6.30	4.44
పుంగనూరు	6.32	4.48

న్యూస్‌రీల్

వైభవంగా కుంభాభిషేకం



హోమ పూజల్లో పాల్గొన్న మంత్రి సత్యనారాయణ

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుకట్ట సమీపంలోని శ్రీశక్తి పీఠంలో బుధవారం కుంభా భిషేకం వైభవంగా నిర్వహించారు. శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు, కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతిస్వామి, మాతాజీ శ్రీరమ్యానంద భారతి ఆధ్వర్యంలో ఆస్థాన పండితులు రమేష్‌శర్మ అర్చక బృందం హోమాలు. కుంభాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. శ్రీకాళికాదేవికి అన్నకూటోత్సవం చేపట్టారు. ఈ కుంభాభిషేక మహోత్సవాల్లో దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు.

డీటీసీగా నిరంజన్ రెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు డీటీసీ(జిల్లా రవాణాశాఖ అధికారి)గా నిరంజన్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ డీటీసీగా పనిచేస్తున్న బసిరెడ్డి ఉద్యోగోన్నతిపై జేటీసీగా తిరుపతికి వెళ్లారు. ఈ క్రమంలో విజయవాడ కార్యాలయంలో పని చేస్తున్న నిరంజన్ రెడ్డిని చిత్తూరుకు బదిలీ చేసింది. గురువారం ఉదయం 9.30కు గంటలకు ఆయన చిత్తూరు డీటీసీగా బాధ్యతలను స్వీకరించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

8వ అదనపు జిల్లా కోర్టుకు ఆ కేసుల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా న్యాయస్థానం, 6వ అదనపు జిల్లా, మహిళా న్యాయస్థానంలోని కేసుల విచారణను మరో కోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ రెండు న్యాయస్థానాల్లోని కేసులను పోక్సో న్యాయస్థానం జడ్జి శాంతి విచారిస్తున్నారు. పాత న్యాయస్థానాల సముదాయంలో జరుగుతున్న ఈ కేసులను, ఎస్టేట్‌లోని న్యాయస్థానాల సముదాయానికి మార్చాలంటూ హైకోర్టు న్యాయమూర్తికి చిత్తూరు బార్ అసోసియేషన్ ఇటీవల విన్నవించుకుంది. దీంతో ఈ రెండు కోర్టుల్లోని కేసులను 8వ అదనపు జిల్లా న్యాయస్థానానికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. చిత్తూరు మాజీ మేయర్ అనురాధ, మోహన్ జంట హత్యల కేసు విచారణ ఇక నుంచి ఎస్టేట్‌లోని 8వ అదనపు జిల్లా న్యాయస్థానంలో జరగనుంది.

ఆరోగ్యానికి చిరునామా

మారుతున్న ఆధునిక పోకడలు.. యాంత్రికపరమైన జీవితం.. నిత్యం పని ఒత్తిడిలో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయడం.. తీరిక లేకుండా బిజీగా గడుపుతూ వేళ కాని వేళ దొరికిన జంక్‌ఫుడ్ తినడానికి అలవాటు పడిన జనజీవనం పంథా మార్చుకుంది. ఆరోగ్యానికి అవసరమయ్యే పోషకాలు ఉన్న తిండిని తినడానికి ఆసక్తి చూపుతున్నారు. అనేక రోగాలతో సతమతమవుతున్న జనం ఇప్పుడు చిరుధాన్యాలను తినేందుకు ఇష్టపడుతున్నారు. చిరుధాన్యాలలో మంచి పోషక విలువలు ఉంటున్నాయి. అలాగే చిరుధాన్యాలు సాగు చేస్తున్న రైతులకు సైతం సిరులు కురిపిస్తున్నాయి. సేంద్రియ పద్ధతులతో సాగు, మంచి ఆరోగ్యానికి చిరునామాగా మారాయి.



వికోటలో రాగి సాగు

- కరోనాకు ముందు.. తరువాత మారిన జీవన ప్రమాణాలు
- ఆరోగ్యం మీద ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ప్రజలు
- జంక్‌ఫుడ్‌కు స్వస్తి చెబుతున్న వైనం
- సేంద్రియ పద్ధతిలో చిరుధాన్యాల సాగు
- చిరుధాన్యాల సాగుతో పాటు పంటలకు గిట్టుబాటు ధర అందిస్తూ ప్రోత్సహిస్తున్న రాష్ట్రప్రభుత్వం

సాక్షి, చిత్తూరు: పిజ్జా.. బర్గర్.. శాండ్‌విచ్.. గోబీరైస్, ఎగ్‌రైస్.. జంక్‌ఫుడ్.. ఫాస్ట్‌ఫుడ్ ఇటీవలి వరకు మనకు రోడ్లపైనే కనిపించే ఆహార పదార్థాలు. వీటిని తినడానికే జనం కూడా కరోనాకు ముందు వరకు ఆసక్తి చూపేవారు. అయితే కరోనాకు ముందు, కరోనా తరువాత అనేలా ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అధిక పోషక విలువలు ఉన్నవాటిని తినడానికి ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు వస్తుండడంతో రైతులు చిరుధాన్యాల సాగుతో మంచి ఆదాయం గడిస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో చిరుధాన్యాల సాగుకు రాష్ట్రప్రభుత్వం మంచి ప్రోత్సాహం అందించడంతో పాటు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. చిత్తూరు జిల్లాలో మాత్రమే సుమారు 25 వేల ఎకరాల్లో చిరుధాన్యాలు సాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా రాగులు, అరికలు కొర్రలు, ఊదలు, సాములు, అండు కొర్రలు, జొన్నలు, సజ్జలు, వరిగలు ప్రధానమైనవి. ఎటువంటి రసాయన ఎరువులు వాడకుండా పశువుల పేడను మాత్రమే ఉపయోగించి చిరుధాన్యాలు సాగు చేస్తుండడంతో మంచి డిమాండ్ ఏర్పడింది. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు అయితే రోజుకు రెండు పూటలా పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకుంటున్నట్లు సర్వేలు చెబుతున్నాయి.

సాగులో ఉన్న చిరుధాన్యాల వివరాలు..

రాగులు	15 వేల ఎకరాలు
సామలు	1000 ఎకరాలు
కొర్రలు	550 ఎకరాలు
జొన్నలు	600 ఎకరాలు
మొక్క జొన్న	3000 ఎకరాలు
అరికెలు	200 ఎకరాలు
సజ్జలు	2000 ఎకరాలు
ఇతర చిరుధాన్యాలు	2650 ఎకరాలు
మొత్తం చిరుధాన్యాలు	25,000

రాగిపంట సాగుపై ఫోకస్

రాగి పంట సాగుపై ప్రభుత్వం మరింత ఫోకస్ చేస్తోంది. రాగుల్లో క్యాల్షియం, ఐరన్, ఫైబర్ ప్రోటీన్లతో పాటు తక్కువ కొవ్వు ఉంటుంది. బరువు తగ్గించే గుణం ఉంది. బీపీని కంట్రోల్ చేసే గుణం కూడా ఉంది. ఇప్పటికే జిల్లాలో సుమారు 15 వేల ఎకరాల్లో సాగుతున్న ఈ పంటకు మంచి ధర ఇచ్చి పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తిరిగి ఈ రాగులు రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు అందించేలా ఏర్పాట్లు చేసింది. ఇక రైతులకు అవసరమైన విత్తనాలు కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇవ్వడం ద్వారా నాణ్యత గల ఉత్పత్తులు సాగు చేసే అవకాశం కలిగింది. ఇప్పటికే మద్దతు ధర క్వింటాలుకు రూ.3500గా ప్రకటించింది.

గిట్టుబాటు ధరకు అమ్ముకునే అవకాశం



ఏటా రాగి పంట వేస్తాం. సుమారు పది క్వింటాళ్లు ఒక ఎకరాలో దిగుబడి అవుతాయి. కిలో రూ.30 వరకు రాగులు పలుకుతాయి. పండించే పంటలు సుమారు సగం వరకు మేమే ఇంటి కోసం ఉపయోగించుకుంటాం. ప్రస్తుతం ప్రభుత్వం రూ.35తో కొనుగోలు చేస్తుందని చెప్పారు. వీటిని చౌకదుకాణాల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తారు. పంట విస్తీర్ణం ఇంకా కొంత పెంచుతాం. గిట్టుబాటు ధరకు అమ్ముకునే అవకాశం కలిగింది.
– లక్ష్మి, కనమనపల్లి, గుడిపల్లి మండలం

మంచి ఆరోగ్యం..



నా భర్త ఉద్యోగం నుంచి రిటైర్ అయిన తర్వాత మా సొంత గ్రామానికి వచ్చి సేంద్రియ పద్ధతిలో చిరుధాన్యాల సాగు చేపట్టాం. రాగులు, మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, అండు కొర్రలు, సామలను మేము తినడంతో పాటు కావాల్సిన వారికి ఇస్తున్నాం. అత్యంత పోషక విలువలు ప్రత్యేక గుణాలు ఉన్న ఈ చిరుధాన్యాలు తినడం ద్వారా మంచి ఆరోగ్యం మన సొంతం. 80 ఏళ్లు దాటినా, ప్రస్తుతం నేను ఆరోగ్యంగా ఉన్నానంటే కారణం మొదటి నుంచి పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్లే. – రత్నా రెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యురాలు, కొలమాసన పల్లి, పలమనేరు

గిట్టుబాటు ధరకే కొనుగోలు



ప్రపంచ ఆహార సంస్థ ఈ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్యాలకు కూడా గిట్టుబాటు ధరలు నిర్ణయించి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఆ విధంగా కొనుగోలు చేసిన వాటిని తిరిగి ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయాలని భావించింది. ఈ చిరుధాన్యాల పంటలకు మరింత ప్రోత్సాహకం అందిస్తోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– జి.మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, చిత్తూరు

పోషక విలువలు ఉండడంతో..



చిత్తూరు జిల్లాలో రాగి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల మధ్యాహ్నం భోజన పథకంలో విద్యార్థులకు రాగిజావను అందిస్తోంది. రాగి పంటకు ప్రోత్సాహక ధరను ప్రకటించడం ద్వారా మరింత నాణ్యమైన పంటను పొందే అవకాశం ఉంటుంది. ఎక్కువమంది ఈ చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో డిమాండ్ పెరిగింది. ఈ ఉత్పత్తుల క్రయ, విక్రయాల కోసం ప్రత్యేకమైన మార్కెట్ కావాలని వినతులున్నాయి. ప్రభుత్వం కూడా ఆ విధంగా చర్యలు చేపట్టింది.
– ఎం. హరినారాయణన్, జిల్లా కలెక్టర్, చిత్తూరు

ఆదర్శప్రాయుడు జగజ్జీవన్‌రామ్



నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి ఆర్కే రోజా, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి కల్చరల్: డాక్టర్ బాబు జగజ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావ్ పూలే ఆదర్శప్రాయులని, బడుగు బలహీనవర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని రిజర్వేషన్ల అమలుకు నాంది పలికారని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి తెలిపారు. మాజీ ప్రధాని బాబు జగజ్జీవన్‌రామ్ 116వ జయంతిని తిరుపతి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. బైరాగిపట్టెడలోని జగజ్జీవన్‌రామ్ పార్క్‌లో ఆయన విగ్రహానికి ఉప ముఖ్యమంత్రితో పాటు మంత్రి ఆర్‌కే.రోజా, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే. బాలాజీ, అధికారులు, వివిధ సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా, పరిపాలనా దక్షుడిగా భారతావనికి విశేష సేవలందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

కులాన్ని చూపి ఓట్లడుగుతున్న పవన్

కులాన్ని చూపి ఓట్లు అడుగుతున్న పవన్ కల్యాణ్ కాపులకు ఏమి చేశారో చెప్పాలని నారాయణస్వామి ప్రశ్నించారు. విలేకరుల అడిగిన ప్రశ్నకు పైవిధంగా స్పందించారు. అధికార పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్న పవన్ కల్యాణ్.. రామోజీరావు, చంద్రబాబు స్కాంలపై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. అనంతరం బాబు జగజ్జీవన్‌రామ్ భవన్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జయంతి సభలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ బలహీనవర్గాలు ఐక్యంగా ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని రిజర్వేషన్లు అమలు లేని కాలంలోనే గుర్తించిన మహానుభావుడు జగజ్జీవన్‌రామ్ అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఉప ప్రధానిగా, పలు శాఖల మంత్రిగా సుదీర్ఘకాలం పని చేసి అనేక సంస్కరణలు తీసుకు వచ్చిన జగజ్జీవన్‌రామ్ ఆదర్శప్రాయులని తెలిపారు. ఎస్సీ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, బాబు జగజ్జీవన్‌రామ్ భవన్ కమిటీ నేతలు, ఎస్వీయూ పాలక మండలి సభ్యుడు మల్లారపు మధు, వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నేత తలారి రాజేంద్ర పాల్గొన్నారు.

‘మా పాపకు పునర్జన్మనిస్తున్నారు’

- మంత్రి రోజా ఎదుట చిన్నారి రుద్రాంక్షి తల్లిదండ్రుల ఆనందం
- చిన్నారి వైద్యానికి రూ.22 లక్షల ప్రభుత్వ సాయం



చిన్నారి రుద్రాంక్షి తండ్రి మహేష్‌కుమార్‌కు చెక్కును అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : మా పాపకు సీఎం జగనన్న, మంత్రి రోజా పునర్జన్మను ఇస్తున్నారని, ఈ మేలను తాము జీవితాంతం మరిచిపోమని చిత్తూరు బాలాజీనగర్‌కు చెందిన నగరి ప్రభుత్వాస్పత్రి వైద్యులు మహేష్‌కుమార్, కల్వగుంట సరిత దంపతులు మంత్రి రోజా ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. బైలియరీ అట్రిసియం వ్యాధితో ఆ దంపతుల ఏడు నెలల కుమార్తె రుద్రాంక్షి బాధపడుతోంది. చిన్నారికి చికిత్స చేయించడానికి చెన్నైలోని డాక్టర్ రేలా ఇన్‌స్టిట్యూట్, మెడికల్ సైన్సెస్ ఆస్పత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు వ్యాధిని నయం చేయడానికి రూ.22 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని సూచించారు. దీంతో మహేష్‌కుమార్ దంపతులు మంత్రి ఆర్కేరోజా తలుపుతట్టారు. తమ పాప బాధను మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి ఆర్కేరోజా ఈ అంశాన్ని సీఎం సహాయనిధి విభాగానికి తీసుకెళ్లారు. దీంతో చిన్నారి వైద్య ఖర్చులకు రూ.22 లక్షలు మంజూరైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ హరికృష్ణ నుంచి చికిత్స అందించే వైద్యశాలకు కూడా ఉత్తర్వులు అందాయి. అందుకు సంబంధించిన మంజూరు పత్రాలను మంత్రి ఆర్కేరోజా తన క్యాంపు కార్యాలయంలో బుధవారం చిన్నారి తల్లిదండ్రులకు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైద్యుడిగా ఎందరినో ఆదుకున్న మహేష్‌కుమార్ కూతురికి మంచే జరుగుతుందని ఆశీర్వదించారు. అలాగే ఆస్పత్రి డాక్టర్లకు మంచి వైద్యం అందించాలని ఫోన్‌లో సూచించారు. అయితే గతంలో కూడా పుత్తూరుకు చెందిన నిహాన్ సాయి అనే 4 నెలల పసికందు వైద్యచికిత్సకు కూడా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.17.5 లక్షలు అందించిన విషయం విదితమే.

మహిళా సంక్షేమమే లక్ష్యం





సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేదికపై ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి, సభకు హాజరైన మహిళలు

- మూడు విడతల్లో రూ.20 వేల కోట్లు జమ
- 31 లక్షల ఇళ్ల పట్టాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: మహిళలను ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా, చేయూత లాంటి పథకాలను అమలు చేస్తున్నారని విద్యుత్‌శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ, మండలంలోని 1, 894 గ్రూపులకు రూ.52.19 కోట్ల ఆసరా చెక్కులను జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డితో కలసి పంపిణీ చేశారు. పట్టణంలోని బీఎంఎస్ క్లబ్, ఎన్‌ఎస్ పేటలో జరిగిన సభల్లో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు ముఖ్యమంత్రి ఇప్పటి వరకు రూ.20 వేల కోట్లను మహిళల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. చంద్రబాబునాయుడు డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామని మహిళలను మోసగించి గతంలో అధికారంలోకి వచ్చారని తెలిపారు. అదే సమయంలో(2014) శ్రీకాళహస్తిలో జరిగిన సభలో రైతు రుణమాఫీపై జగన్‌మో హన్‌రెడ్డికి సూచించామన్నారు. కానీ ఆయన అమలు చేయలేని హామీలను ఇచ్చేది లేదని, అధికారం వచ్చినా రాకపోయినా ఫర్వాలేదంటూ స్పష్టం చేశారని గుర్తుచేశారు. అలాంటి ఉన్నత విలువలు కలిగిన జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98.44 శాతం అమలు చేశారని కొనియాడారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన ఘనత తమ ప్రభుత్వా నిదేనని మంత్రి తెలిపారు. మహత్తర పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా చిరకాలం కొనసాగేలా ఆశీర్వదించాలని కోరారు.

తాగు, సాగునీరు

పుంగనూరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని ప్రజలకు ఇంటింటికీ కొళాయిల ద్వారా నీరు ఇచ్చే కార్యక్రమం త్వరలోనే చేపడుతామని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. నేతిగుట్లపల్లె, ఆవులపల్లె రిజర్వాయర్ల పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. బెంగళూరు నుంచి రొంపిచెర్ల క్రాస్ వరకు రోడ్డును నేషనల్ హైవేగా ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి మార్పు చేయించారని మంత్రి తెలిపారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు జ్ఞానప్రసన్న, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో
వైఎస్సార్‌సీపీలో చేరిక


మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారు

పుంగనూరు: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పుంగనూరు పట్టణానికి చెందిన నౌషాద్, కరీముల్లాతో పాటు సుమారు 25 మందికి మంత్రి పెద్దిరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి బుధవారం పార్టీలోకి చేర్చుకున్నారు. పార్టీని పటిష్టపరిచేందుకు కృషి చేయాలని మంత్రి వారికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, రాయలసీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమానత్వమే జగ్జీవన్‌రామ్ ఆశయం




బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ హరినారాయణన్, మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రెడ్డెప్ప

- మహోన్నత వ్యక్తి బాబుజగ్జీవన్‌రామ్
- దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివి
- ఎమ్మెల్యే ఆరణి, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కార్పొరేషన్: కుల, జాతి వివక్ష రూపుమాపి అందరూ సమానమేనని నిరూపించిన మహోన్నత వ్యక్తి, దేశ మాజీ ఉపప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. బుధవారం వారు బాబుజగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా గంగినేని చెరువు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నగరంలో ఆయన చిత్రపటంతో దళిత సంఘాల నాయకులతో కలిసి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ రైల్వేశాఖలో రిజర్వేషన్ విధానం ప్రవేశ పెట్టింది బాబు జగ్జీవన్‌రామ్ అని తెలిపారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే, కలెక్టర్లు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే కులవివక్షపై పోరాటలు చేసిన మహనీయుడు, హరితవిప్లవం విధానాన్ని తీసుకొచ్చింది బాబు జగ్జీవన్‌రామ్ అని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ప్రకారం వెనుకబడిన వర్గాల ప్రజల అభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 20 పథకాల ద్వారా నిమ్నజాతి వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని వివరించారు. ముఖ్యంగా విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

బలహీనవర్గంలో పుట్టి దేశానికి ఉపప్రధాని, వివిధ శాఖల మంత్రిగా పనిచేసి బడుగు, బలహీనవర్గాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య అన్నారు. అనంతరం పలు దళిత సంఘాల నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు, హౌసింగ్ పీడీ పద్మనాభం, సాంఘిక సంక్షేమశాఖ సిబ్బంది, దళిత సంఘాల నాయకులు డేవిడ్, చెంగయ్య, రాజ్‌కుమార్, కుమార్, మున్స్వామి, వరదరాజులు, ధనుంజయరావు, దామోదారం, రవి, మురగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రాణం తీసిన ఈత సరదా



హరికృష్ణారెడ్డి (ఫైల్), హరికృష్ణారెడ్డి మృతదేహం

కుప్పంరూరల్: ఈత నేర్చుకోవాలనే సరదా ఓ విద్యార్థి పాలిట మృత్యువుగా మారింది. వివరాలు.. కుప్పం పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ మొదటి సంవత్సరం చదువుతున్న హరికృష్ణారెడ్డి బుధవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి కుప్పం మండలం మటార్లపల్లి సమీపంలోని వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లాడు. స్నేహితులు ఈత కొడుతుండగా, ఈత రాని హరికృష్ణారెడ్డి బావికి ఉన్న మెట్లరాయిని పట్టుకుని ఈత నేర్చుకోవడానికి ప్రయత్నించాడు. అయితే మెట్టు ఊడి రాయి ముఖంపై పడడంతో హరికృష్ణారెడ్డి నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు ఈ విషయాన్ని కళాశాల అధ్యాపక బృందానికి తెలియజేశారు. అధ్యాపకులు పోలీసులను ఆశ్రయించగా, వారు అగ్నిమాపక సిబ్బంది సాయంతో హరికృష్ణారెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. హరికృష్ణారెడ్డిది సత్యసాయి జిల్లా గోరంట్ల గ్రామం. పోలీసులు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు చెప్పారు. బుధవారం వరకు తమతో కలిసి తిరిగిన హరికృష్ణారెడ్డి సాయంత్రం మృత్యువాత పడడం బాధాకరమని తోటి మిత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కళాశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ముస్లింలకు ఎంబీయూ అండ


ప్రత్యేక ప్రార్థనల్లో చాన్సలర్ మోహన్‌బాబు, ప్రో చాన్సలర్ మంచు విష్ణు

చంద్రగిరి: మోహన్‌బాబు యూనివర్సిటీ సమీప గ్రామాల్లోని పేద ముస్లిం కుటుంబాల్లోని విద్యార్థులకు ఎంబీయూ తరఫున విద్యలో అండగా నిలుస్తానని యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ మంచు మోహన్‌బాబు అన్నారు. బుధవారం రాత్రి ఎంబీయూలో సుమారు 2వేల మంది ముస్లింలకు ఆయన ప్రో చాన్సలర్ మంచు విష్ణుతో కలసి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముందుగా మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థన చేశారు. మోహన్‌బాబు మాట్లాడుతూ స్థానిక ప్రజల అభిమానం, ఆప్యాయతతోనే ఎంబీయూకు ఈ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. ఎంబీయూ చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో మసీదులు, దర్గాల నిర్మాణం కోసం తనవంతుగా ఆర్థిక సాయం చేస్తానని ప్రకటించారు. వీసీ నాగ రాజ రామారావు, రిజిస్ట్రార్ సారథి, సీఏఓ తులసీ నాయుడు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75

పశుగ్రాసం లారీలో అక్రమంగా బియ్యం రవాణా

గుడుపల్లె: తమిళనాడు రాష్ట్రం నుంచి పశుపగ్రాసం వేసుకుని అందులో బియ్యం బస్తాలను తరలిస్తున్న లారీని బుధవారం గుడుపల్లె పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని కుప్పం నుంచి కేజీఎఫ్‌కు వెళ్లే రోడ్డులోని గెసికిబావి రోడ్డు వద్ద పశుగ్రాసంతో వెళ్తున్న లారీని స్థానిక ఎస్‌ఐ రామాంజనేయులు ఆపి తనిఖీ చేశారు. లారీలో ఉన్న పశుగ్రాసం కట్టలను కిందకు దింపగా, కింద సుమారు 100 బస్తాల తమిళనాడు బియ్యం ఉన్నట్లు గుర్తించారు. తమిళనాడు నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేటకు బియ్యం తరలిస్తున్నారని ఎస్‌ఐ చెప్పారు. లారీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్రూప్-2 కొత్త సిలబస్‌పై అవగాహన రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి తిలక్ రోడ్డులోని శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీవేంకటేశ్వర అకాడమీలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు గ్రూప్-2 నూతన సిలబస్‌పై ఉచిత సదస్సు ని ర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ ఎస్.గీతాంజలి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2లో కొత్తగా చేర్చిన సైన్స్ అండ్ టెక్నాలజీని వివరించనున్నట్లు పేర్కొన్నారు. గ్రూప్-2 శిక్షణకు మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణతో పాటు మెటీరియల్‌ను అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 81793 92526 నంబరులో సంప్రదించవచ్చని ఆమె కోరారు.

పన్నుల వసూళ్లలో మనమే ఫస్ట్

ప్రభుత్వానికి ఆదాయం ఇచ్చే శాఖల్లో వాణిజ్య పన్నులశాఖ ప్రధానమైనది. రాష్ట్ర సెక్రటేరియట్, వాణిజ్య పన్నులశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రణాళికబద్ధంగా పన్నులు వసూలు చేసి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచారు. జిల్లాలో పన్నుల వసూళ్లలో 38 శాతం వృద్ధి చెంది రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించినట్లు అధికారులు తెలిపారు.

- కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆశాజనకంగా పన్నుల వసూళ్లు
- ప్రభుత్వం బకాయిల వసూలుకు వడ్డీమాఫీ చేయడంతో చాలామందికి లబ్ధి
- గతేడాది కంటే 38 శాతం వృద్ధి
- పన్ను వసూలులో మొదటి స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా

చిత్తూరు కార్పొరేషన్: గత సంవత్సరం నుంచి కోవిడ్ ప్రభావం నుంచి వ్యాపారాలు కోలుకుంటున్నాయి. క్రమేణా వ్యాపారా లావాదేవీలు జరగడంతో పన్నుల వసూళ్లు పెరిగింది. వసూళ్లపై దృష్టి పెట్టిన అధికారులు తరచూ సమావేశాలు ఏర్పాటు చేసుకుని సమీక్షించారు. రాష్ట్ర, జిల్లా, డివిజన్ల వారీగా సమీక్ష పెట్టుకుని పన్నుల వసూళ్లకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించుకున్నారు. జిల్లాలోని 40 వేల మంది డీలర్ల ద్వారా రూ.1282.78 కోట్లు వసూలు చేశారు. తరుచూ సమావేశాలపై సమీక్ష నిర్వహిస్తుండడంతో పనుల్లో వేగం పెరిగింది. వ్యాపారులతో మాట్లాడి పన్నులు కట్టించడంతో పాటు వాహనతనిఖీలు, ఆడిట్, తనిఖీలు, పాత బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో వృత్తి పన్ను రూ.23.89 కోట్లు వసూలై రాష్ట్రంలో మొదటి స్థానం నిలిచిందని అధికారులు పేర్కొన్నారు.

రూ.1282.78 కోట్లు వసూలు..

జిల్లాకు ఆర్థిక సంవత్సరం 2022–23 పరంగా రూ.1418 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇందులో రూ.1282.78 కోట్లు వసూలు కావడంతో 90.46 శాతం వసూళ్లు సాధించాయి. గతేడాదితో పోలిస్తే 38 శాతం వృద్ధిలో ఉంది.


జిల్లా వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం

నిర్లక్ష్యం వద్దు..



అందరి సహకారంతో ముందుకు పోతాం.. కిందిస్థాయి సిబ్బంది కష్టం నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల సూచనల వరకు అందరి సహకారంతో జిల్లా నేడు రాష్ట్రంలో ప్రథమ స్థానం నిలిచింది. తరచూ సమావేశాలు నిర్వహించాం. పాత బకాయిల వసూళ్లు, వాహన తనిఖీలు, ఆడిట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం. వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించి జరిమానాల నుంచి దూరం కావాలి. పన్నుల చెల్లింపులో నిర్లక్ష్యం వద్దు. ప్రభుత్వానికి సహకరించాలి. – జాన్‌స్టీవెన్‌సన్, సంయుక్త కమిషనర్, వాణిజ్య పన్నులశాఖ

ప్రాంతం	లక్ష్యం రూ.కోట్లలో	వసూలు రూ.కోట్లలో
చిత్తూరు-1	98.29	102.15
చిత్తూరు-2	99.69	74.18
గుడూరు	157.49	130.95
పలమనేరు	60.83	55.34
స్పెషల్ చిత్తూరు	412.82	418.73
శ్రీసిటీ	96.78	87.64
శ్రీకాళహస్తి	89.09	83.26
తిరుపతి-1	245.12	239.72
తిరుపతి-2	274.69	302.96

ప్రధాన పన్నుల వివరాలు

తనిఖీలు -	రూ.15.23 కోట్లు
ఆడిట్ -	రూ.1.66 కోట్లు
వృత్తిపన్ను -	రూ.23.89 కోట్లు
వాహన తనిఖీలు -	రూ.2.23 కోట్లు
పాతబకాయిలు వసూలు -	రూ.23.89 కోట్లు
కాంట్రాక్టర్స్ ద్వారా వచ్చిన పన్నులు -	రూ.130 కోట్లు
బంగారు అమ్మకం ద్వారా వచ్చిన పన్నులు -	రూ.90 కోట్లు
ఆటో మొబైల్స్, పరికరాలు -	రూ.73 కోట్లు
ఐరన్, స్టీల్ -	రూ.65 కోట్లు
ప్యాకింగ్ మెషిన్ -	రూ.50 కోట్లు

ఏనుగుల బీభత్సం


ఏనుగులు తొక్కేసిన అరటి పంటను చూపుతున్న బాధిత రైతు

ఐరాల: మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. మంగళవారం రాత్రి వినాయకపురంలో మామిడి, అరటి తోటలపై ఏనుగుల గుంపు దాడి చేసింది. రైతు మోహన్‌రెడ్డికి చెందిన నాలుగు ఎకరాలలో మామిడి చెట్లను విరిచేసి, కాయలను తిని తొక్కి నాశనం చేశాయి. అలాగే విజయ్‌కుమార్‌రెడ్డికి చెందిన మామిడి తోటకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను సైతం ధ్వంసం చేశాయి. రెండు ఎకరాలలో మామిడి చెట్లను విరిచేశాయి. మరో రైతు వినయ్‌రెడ్డికి చెందిన ఎకరాలో మామిడి చెట్లను, మహిళా రైతు పార్వతమ్మకు చెందిన మూడు గుంటల్లోని అరటి పంటను తొక్కి నాశనం చేశాయి. సుమారు రూ.5 లక్షల పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న నాగవాండ్లపల్లె ఫారెస్టు బీట్ అధికారి నరేష్ ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన మామిడి, అరటి పంటలను పరిశీలించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


లారీ కింద పడి చనిపోయిన మునిరాజులు

ఐరాల: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని చిత్తూరు-కడప జాతీయ రహదారిలోని గుండ్లపల్లె వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. తవణంపల్లె మండలం దిగువమారేడుపల్లె ఎస్సీ కాలనీకి చెందిన మునిరాజులు(72) బుధవారం బైక్‌లో స్వగ్రామం నుంచి ఐరాల మండలం గుండ్లపల్లె ఎస్సీ కాలనీలో ఉన్న మూడో కుమార్తెను చూసేందుకు బయలుదేరాడు. అక్కడి నుంచి తిరిగి బైక్‌లో స్వగ్రామానికి వెళ్తుండగా గుండ్లపల్లె వద్ద ఎర్రగుంట్ల నుంచి చిత్తూరు వైపు వస్తున్న సిమెంట్ లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మునిరాజులు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

చంద్రగిరి: నాగపట్ల బీట్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ అధికారుల వివరాల మేరకు..టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఆర్‌ఐలు సురేష్ కుమార్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి బృందం భాకరాపేట రేంజ్ నుంచి మంగళవారం రాత్రి కూంబింగ్ చేపట్టింది. వీరు నాగపట్ల బీట్ పరిధిలోని సచ్చినోడి బండ ప్రాంతానికి చేరుకునే సరికి కొందరు ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళ్తూ వారి కంటబడ్డారు. తమను అధికారులు చుట్టుముట్టే ప్రయత్నం చేస్తున్నారని పసిగట్టిన స్మగ్లర్లు దుంగలను పడేసి చీకట్లో పారిపోయారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు 8ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి స్మగ్లర్ల కోసం గాలిస్తున్నారు. ఎరచ్రందనం దుంగలను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ మోహన్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెర్లోపల్లిలో పేలిన గ్యాస్ సిలిండర్లు


అగ్నికి ఆహుతి అవుతున్న వలస కూలీల పూరి గుడిసెలు

- వలస కూలీల గుడిసెల్లో అగ్నికీలలు
- వంట చేస్తుండగా అంటుకున్న మంటలు
- తప్పిన పెనుముప్పు
- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



పేలిన గ్యాస్ సిలిండర్, తెగిపడిన గ్యాస్ రెగ్యులేటర్ పిన్

తిరుపతి రూరల్: చెవులు చిల్లులు పడేలా శబ్దాలు..తారాజువ్వల్లా పైకెగిరిన వంట గ్యాస్ సిలిండర్లు...ఎండ వేడికి అప్పటికే కాగిపోతున్న గుడిసెల్లో నుంచి ఎగిసిపడిన అగ్నికీలలు..కళ్లెదుటే అగ్నికి ఆహుతి అవుతున్న వస్తువులను చూసి ఆర్తనాదాలు చేస్తున్న రాష్ట్రం కాని రాష్ట్రం వచ్చిన వలసకూలీలు.. రెండు అగ్నిమాపక వాహనాలతో ఫైర్ సిబ్బంది శ్రమించినా అదుపులోకి రాని మంటలు..తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె పంచాయతీలో బుధవారం సాయంత్రం పెను అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కన్‌స్ట్రక్షన్ సంస్థకు చెందిన భవన నిర్మాణ పనుల కోసం ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుంచి పదుల సంఖ్యలో వలస కూలీలను రప్పించారు. వారి కోసం చెర్లోపల్లెలోని నిర్మాణం జరిగే ప్రాంతానికి సమీపంలో దాదాపు 30 పూరి గుడిసెలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం ఓ గుడిసెలో వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు గుడిసెకు అంటుకున్నాయి. వంట గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకోవడం, గ్యాస్ కూడా పెద్ద ఎత్తున లీక్ అయి అగ్నికీలలు క్షణాల్లో పక్క గుడిసెలకు కూడా వ్యాపించాయి. కొన్ని గుడిసెల్లో గ్యాస్ సిలెండర్లను ఆర్పకుండా అలాగే వదిలేయడంతో టపాసుల్లా గ్యాస్ సిలిండర్లు పేలిపోయాయి. మూడుకు పైగా సిలిండర్లు పేలిపోయి జనాల్లోకి, పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పడిపోయాయి. అగ్నికీలల దెబ్బకు గ్యాస్ సిలెండర్ల నుంచి రెగ్యూలేటర్ల నాజిల్స్ కూడా తెగిపోయి దూరంగా పడిపోయాయంటే ప్రమాద తీవ్రతకు నిదర్శనం. వలస కూలీలకు సంబంధించిన పింఛన్ పుస్తకాలు, నిత్యావసర వస్తువులు, దుస్తులు సైతం అగ్నికి ఆహుతి అయ్యాయి. కూలీలు పనులకు వెళ్లి ఉండడంతో ప్రాణ నష్టం తప్పిందని ఎంఆర్‌పల్లె సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు.

రెండు అగ్నిమాపక వాహనాలతో....

ప్రమాదం విషయం తెలుసుకున్న ఎంఆర్‌పల్లె సీఐ సురేంద్రరెడ్డి, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. కూలీలను దూరంగా పంపించారు. అగ్నిమాపక సిబ్బంది రెండు వాహనాల్లో చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు శ్రమించారు. గ్యాస్ సిలిండర్లు పేలుతుండడంతో సహాయక చర్యలు నెమ్మదిగా సాగాయి. ఇంకా ఎలాంటి ఫిర్యాదు రాలేదని, వస్తే కేసు నమోదు చేసి, విచారిస్తామని ఎంఆర్‌పల్లె సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు.